


# పాతదే కథ

రాచకొండ విశ్వనాథశాస్త్రి

అనగా అనగా ఒక భూకామందు.

ఆ కామందుకి ఏడుగురు వ్యాపారి కొడుకులు.

ఏడుగురు కొడుకులూ కలిసి ఓ పారి లాభాల వేటకి వెళ్లేరు. వెళ్లి ఏడుగురు ఎండు కూలీల్ని పట్టుకొచ్చేరు. తెచ్చేక, వాళ్ళని ఎండలో బండ రాళ్ళు తవ్వమన్నారు. మొయ్యమన్నారు.

ఆరుగురు కూలీలు కిక్కురు మనకుండా బండచాకిరీ చేసేరు.

ఒకడు మాత్రం ఎండ బాధ, రాళ్ళ బరువూ భరించలేక, దూరంగాపోయి, ఓ ఎండు గడ్డి (మేటు) మీద పడి ఏడుస్తూ కూర్చున్నాడు.

ఏడ్చే కూలీని చూసి ఏడుగురు వ్యాపారి కొడుకులూ నిర్ఘాంతపోయేరు. ఆ తరవాత ఉగ్రకోపులయేరు.

"ఏంరా కూలీ కూలీ! పీడనా కూర్చుంటావు! ఏడుపా ఏడుస్తావు!" అని ఒళ్ళెరగని కోపంతో కేకలేసేరట వ్యాపారి...కొడుకులు!

అందుకా ఆ ఏడో కూలీవాడు ఏదో చెప్పబోయి శోషొచ్చి పడిపోయేట్ట.

అప్పుడు. ఏం జరిగిందో తెలియక, ఆ ఏడుగురు వ్యాపారపు కొడుకులూ (ఎక్కడికీ వెళ్ళకుండా) అక్కడకే తమ మానేజర్ని పిలిపించి అడిగేరట.

మానేజరు చాలాసేపు ఆలోచించి తన సెక్రెటరీని పిలిపించేట్ట.

సెక్రెటరీ అర్జంటుగా వెళ్ళి లేబర్ ఆఫీసర్ని దగ్గిరుండి తీసుకొచ్చేట.

లేబర్ ఆఫీసర్ లేటుగా వెళ్లి కంపెనీ డాక్టరుకి ఫోన్ చేసేట్ట.

డాక్టరుగారి డిస్పెన్సరీ ఫోన్ చచ్చిపోయిందట. ఇంటి ఫోన్ బతికే ఉందట. కాని వారికి కబురు వెళ్ళేసరికి చాలా సేపయిందట

కబురందిన తరువాత డాక్టర్‌గారు వచ్చి చూసి ఆ ఏడో కూలీకి నూరేళ్లూ నిండుకున్నాయని చెప్పేసి, వెంటనే బిల్లు రాసి ఇచ్చి డబ్బు పుచ్చుకొని వెళ్ళిపోయేట్ట.

బతికున్న కూలీలు అక్కడికివచ్చి "మావాడు ఎందుకు చచ్చేడు?" అని అడిగేరట.

కర్మకాలి చచ్చేడని ఏడుగురు వ్యాపారి కొడుకులు ఏక కంఠంతో జవాబు చెప్పేరుట

ఆ తరవాత వాళ్లు కంపెనీ మీటింగు పెట్టి, "నిజమైన కారణం ఏమిటయ్యా?" అని తమ కంపెనీ డాక్టర్ని రహస్యంగా అడిగేరట.

"నిజం తెలుసుకోవడం మంచిది కాదు" అన్నాట్ట డాక్టరు.

"ఆరుగురు కూలీలుకూడా అలాగే చస్తే మరి మాకు దొంగ లాభాలెలావస్తాయి?" అని ఏడుగురు కొడుకులూ వెక్కి వెక్కి ఏడ్చేరట.

జబ్బులమీద బలిసిన దొడ్డడాక్టరు, "ఆ ఎండు కూలీ తిండిలేక చచ్చేడు" అని అప్పుడు అసలు నిజం చెప్పేట్ట.

"కూలీలంతా చావకుండా బతకాలంటే ఏం చెయ్యాలి?" అని ప్రశ్నించేరుట ఏడుగురు వ్యాపారి కొడుకులూను.

"తిండి పెట్టండి" అని సలహాచెప్పి, బిల్లు రాసిఇచ్చి ఫీజు పుచ్చుకొని వెళ్ళిపోయేట్ట బిల్లుల మీద బలిసిన ఆ తెల్ల డాక్టరు

అప్పుడు ఏడుగురు వ్యాపారపు కొడుకులూ ఏకకంపెనీగా కూర్చుని, "ఏం చెయ్యాలి?" అని చర్చించుకున్నారట.

కూలీలకి తిండి పెడుతున్నాం కదా! అన్నాట్ట ఓ కొడుకు. పెద్దవాడు వాడు.

"ఏమిటో తిండి?" అని అడిగేట్ట ', కొడుకు

"పచ్చివి ఎంతో మంచివి మంచి నీళ్ళు" అన్నాడు మానేజింగు పెద్ద కొడుకు.



"అయితే వాటికి అవి చాలవన్న మాట" అన్నాడు రెండో కొడుకు.

"మరేం చెయ్యాలి" అని అమాయకంగా అడిగేడు మూడో కొడుకు.

"మంచి నీళ్ళతోపాటు కొంచెం పచ్చమన్ను ఇవ్వనేం" అని ఓసూచన చేసేడు నాలుగో కొడుకు.

"అది పే మన లాభాలకి అది పెద్దదెబ్బ" అన్నాడట పెదకొడుకు.

ఎంతదెబ్బ? అని అడిగేడు అయిదో కొడుకు.

"మనకి ఇప్పుడు నూటికి రెండువందలే లాభం: పచ్చమన్ను కూడా వేసేం అంటే ఓ పావలామేరకి దెబ్బ" అన్నాడుట అన్నీ తెలిసిన అన్నగారు.

ఆమాట (అంటే పావలా దెబ్బమాట వినగానే) పాపం ... ఆ ఆఖరి కొడుకు మూర్ఛపోయేట.

డాక్టరొచ్చి, డబుల్ బిలు రాసి ఇచ్చి డబ్బులు పుచ్చుకొని వెళ్ళిపోయేక (అంటే ఆఖరికొడుకు మూర్ఛలోంచి లేచేక) మీటింగు మళ్ళీ జరిగిందట.

ఎండు కూలీలకి పచ్చమన్ను పెట్టకూడదని కంపెనీవారు ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారట.

దాన్తో ఆరుగురు కూలీలు హరీ మన్నారట.

ఏడుగురు కొడుకులూ కూలివేటకి వెళ్ళి మరో ఏడుగురు కూలీల్ని పట్టి తెచ్చేరట. వాళ్ళు కూడా చచ్చేరట.

ఇలా అయిదారు సార్లు జరిగేసరికి నూటికి రెండువందల లాభం బదులు నూటికి నూట యాభయ్యే లాభం తేలిందట.

అంతే లాభం అని తెలిసేసరికి ఏడుగురు వ్యాపారపు కొడుకులూ కూడా గుండెలు అగిపోయి చచ్చి మళ్ళీ వెంటనే బతికేరట. బతికి, "అప్పా అప్పా!" అని గుండెలు బాదుకొంటూ, భూకామందైన తండ్రిగారి దగ్గరికి వెళ్ళి ఆయన కాళ్ళమీద పడ్డారట.

అప్పుడు భూకామందైన ఆ తండ్రి అన్ని విషయాలూ తెలుసుకొని చిరునవ్వు నవ్వి

"నాయనలారా వాచిన్న పొన్ని కొడుకుల్లారా! మనం బతకాలంటే కూలీలు చావకూడదు వారు కూడా బతకాలి కాని మనం బాగుపడాలంటే వారు చావాలి" అని గంభీరంగా ఉపన్యసించి ఊరుకున్నాట.

"తండ్రీ! వివరంగా విపులంగా విశదీకరింపుము!" అని బతిమాలుకున్నారట బుద్ధిమంతులైన ఆ ఏడుగురు కొడుకులూను.

అప్పుడు.

ఆ భూకామందుల వారు.

"ఓనా ఓటి పోటి పిల్లల్లారా. షేలిమి బంగరు చిలకల్లారా మనం బాగుపడాలంటె కూలివాండ్రు చావనూ చావకూడదు. బతకనూ బతకకూడదు. వారు చస్తే మనకు ఎట్టి లాభము సంపాదించే అవకాశమున్నూ ఉండదు గనుక మన లాభములకు కొంత నష్టము కలిగిననూ వారిని మనము కొంతవరకు కొన ఊపిరితో నుంచవలెను. నూరు రూకల లాభములకు ఒక రూక ఖర్చయిన మన సొమ్మేమి పోయినది! అందుచేత నేటినుండి వారికి మీరు మనిషికి ఇంత ఎండుగడ్డి. ఇంత (ఉప్పు బద్ద కలిపిన) మంచినీరూ అని విర్ణయించి ఇచ్చి వారు చావకుండా చూచుకొనండి. కాని, ఒక్క మాట: ఎప్పుడైనా తప్పనప్పుడు మరికొంత గడి వేస్తే వెయ్యండి గాని. వారికి ఓనమాలు మాత్రం చెప్పింపకండి అదికంకరుడు ఏమి చెప్పెను: జ్ఞానమార్గమే అసలు మార్గమని అనలేదా అతడు! అందుచేత కూలీజనులకు జ్ఞానమార్గములన్నీ బంద్ చేయునట్టు సెక్సు సినిమాలు చూపించండి. సురాపానము చేయించండి మరొక రెండు గడ్డిపరకలు పడవేయుండి! కాని జ్ఞానదీపాలు వారు వెలిగించుకోకుండా మాత్రం మీరు బహు జాగ్రత్తగా ఉండండి" అని విశదీకరించేను.

ఆ ఉపదేశం పొంది బాగుపడ్డారు వ్యాపారపు కొడుకులు

అప్పటి నుండి కూలీలందరికి రెండేసి పరకల చొప్పున ఎండుగడ్డి మూడేసి చుక్కల చొప్పున ఉప్పు నీరూ సప్లయి కాజొచ్చేయి.

అప్పుడు —

వ్యాపారపు చోరపుత్రులంతా చేరి ఏమన్నారూ అంటే:

"ఇదే సోషలిజం!" అన్నారు.

అప్పుడు చోరనాయకులు కొందరు కార్మిక నాయకులుగా మారి!"

"అవు విదే సోషలిజం!"

అని అరిచరిచి చెప్ప వారుకూడా కంపెనీ డాక్టర్లాగే డబ్బులు పుచ్చుకొని ఇళ్ళకివెళ్ళారు. అయితే. అందుకు బిల్లుమాత్రం ఉండవుట.

ఇదికథ: ఇదింకా కంచికిమాత్రం వెళ్ళలేదు. ఎందు చేతనూ అంటే, ఎండు కూలీలంతా ఎండకోనే ఉన్నారు. భూకామందుల వ్యాపారపు కొడుకులు లాభాలవేటల్లో ఇంకా ఈ లోకంలోనే. మన పీకలమీదే ఉన్నారు.